నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో లాస్య ప్రతిభ

ప్రజాశక్తి - కడప : మహారాష్ట్రలోని నాందేడ్‌లో నిర్వహించిన 68వ నేషనల్ ఎస్‌జిఎఫ్ అండర్-14 బాలికల చెస్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ గర్ల్స్ అండర్-14 టీమ్ ప్రతిష్టాత్మకంగా 4వ స్థానం సాధించింది. ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించిన కడపకు చెందిన లాస్య శ్రీ ప్రతిభ కనబరిచింది. కడపలోని గాంధీనగర్ మునిసిపల్ కార్పొరేషన్ హై స్కూల్ విద్యార్థిని టీమ్ విజయంలో కీలక పాత్ర పోషించింది. 6 రౌండ్లలో 3.5 పాయింట్లు సాధించి తన ప్రతిభను ప్రదర్శించింద.ఇ ఈ టోర్నమెంట్‌లో ఆమె ప్రదర్శన టీమ్‌ను టాప్ కంటెండర్ల జాబితాలో నిలబెట్టడంలో ముఖ్య పాత్ర పోషించింది. కడప జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి, కోచ్ అనీస్ దర్బారి లాస్య శ్రీ కి అభినందనలు తెలియజేశారు. ఆమె నిరంతర కృషి మరియు అంకితభావం విజయానికి కారణమని వివరించారు. ఈ ఘనత కడప, మొత్తం ఆంధ్రప్రదేశ్ చెస్ కమ్యూనిటీకి గర్వకారణంగా నిలుస్తోంది. ఇది రాష్ట్రంలో చెస్ ప్రమాణాలు పెరుగుతున్నదానికి నిదర్శనం.

కీచక డిటిసిపై సరెండర్ వేటు

బాధిత మహిళలకు అండగా ఉంటాం : మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ విచారణ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/కడప అర్బన్

కడప రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డిపై సరెండర్ వేటు పడింది. మహిళా ఉద్యోగులను లైంగికంగా వేధించినట్లు అతడిపై ఆరోపణలు ఉన్నాయి. గురువారం మహిళా బ్రేక్ ఇన్‌స్పెక్టర్ ఇంటికి వెళ్లి డిటిసి వేధించాడు. అతడికి మహిళా ఉద్యోగి కటుంబ సభ్యులు శుక్రవారం దేహశుద్ధి చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. అతడిని రాష్ట్ర కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. మహిళా ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లా రవాణా శాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి భర్త పొరుగు జిల్లాలో పనిచేస్తున్నారనే తెలుసుకుని సదరు ఉద్యోగిని ఇంటికి వెళ్లి వేధించడంతో వ్యవహారం పరాకాష్టకు చేరుకుంది. దీనికి ఆమె విసిగిపోయి పొరుగు జిల్లాలో పనిచేస్తున్న తన భర్తకు తెలిపింది. సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేసిన సిసి కెమెరాల సహాయంతో పరిస్థితిని సమీక్షించుకున్న అనంతరం మరుసటి రోజుకు కడపకు చేరుకుని భార్యతో కలిసి డిటిసి కార్యాలయానికి వెళ్లి చితకబాదడంతో లైగింక వేధింపుల ఘటన మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. మరో మహిళా ఉద్యోగి పట్ల లైగింక వేధింపులకు పాల్పడడంతో ఆమె సెలవుపై వెళ్లిపోయినట్లు సమాచారం. బాపట్ల జిల్లాలో పనిచేసిన సమయంలోనూ ఆయన లైంగిక వేధింపులకు పాల్పడినట ఆరోపణలు ఉన్నట్లు సమాచారం. రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తాజా లైంగిక వేధింపుల ఘటన పట్ల సీరియస్‌గా స్పందించడంతో రవాణా శాఖ అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఆగమేఘాల మీద సరెండర్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. రవాణా శాఖా మంత్రి సదరు అధికారి ప్రవర్తన పట్ల సీనియర్ అధికారితో సమగ్ర విచారణ చేసిన అనంతరం శాఖా పరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ప్రకటన విడుదల చేశారు. అనంతరం ఆయన సదరు ఉద్యోగిని, కుటుంబ సభ్యు లను ఫోన్ ద్వారా సంప్రదించి భయపడొద్దని అండగా ఉంటామని హామీనిచ్చారు. ఇప్పటికే నిందితునిపై చర్యలకు ఆదేశాలు జారీ చేశామని, శిక్షపడేలా చేస్తామని భరోసానిచ్చే ప్రయత్నం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వం మహిళలపై లైంగిక వేధింపుల పాల్పడితే ఉపేక్షించబోమని హెచ్చరించడం గమనార్హం.

జెటిసి విచారణ : తాజా లైంగిక వేధింపుల ఘటనపై జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బి.కృష్ణవేణి ఆధ్వర్యంలో శుక్రవారం విచారణ ప్రారంభమైంది. డిటిసి కార్యాలయ ఉన్నతాధికారి బాధిత మహిళ పట్ల అసభ్యకర ప్రవర్తన తీరుపై బాధిత ఉద్యోగి, ఆమె భర్త నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్లు సమాచారం. లైంగిక వేధింపుల ఘటనకు సంబంధించి సదరు ఉన్నతాధికారి వ్యవహార సరళిని సిసి ఫుటేసి ఆధారంగా పరిశీలించారు. అనంతరం ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు తెలుస్తోంది. రవాణా శాఖ సర్వీస్ రూల్స్ మాన్యువల్ ప్రకారం పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు ఉండ కూడదని, ప్రభుత్వ సిఫారసుల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని ట్రాన్స్‌పోర్టు జాయింట్ కమిషనర్ పేర్కొనడం గమనార్హం.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి : ఉద్యోగినిలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ డిటిసి చంద్రశేఖర్‌రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిపిఐ నగర కార్యదర్శి వెంకట శివ డిమాండ్ చేశారు. శుక్రవారం డిటిసి కార్యాలయం వద్ద నిరసనలో ఆయన మాట్లాడుతూ టిడిసిని ఉద్యోగం నుంచి తక్షణం తొలగించాలన్నారు. మూడు నెలల కిందట కడపలో బాధ్యతలు చేపట్టిన అతను తమ శాఖలో మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, లైంగిక వేధింపులకు పాల్పడుతుందటం దారుణమన్నారు. ఉద్యోగినిలతో వాట్సాప్‌లో చాటింగ్‌లు చేస్తూ, రాత్రుళ్ళు ఫోన్‌లు చేస్తూ, చివరికి ఇళ్ల వద్దకు వెళ్ళిన కామాంధుడిని కాటికి పంపేంతవరకు ప్రభుత్వం తగు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

విధుల నుంచి తొలగించాలి : సహా ఉద్యోగినిపై అసభ్యంగా ప్రవర్తించిన అధికారిపై తక్షణం పోక్స్ కేసు నమోదు చేసి, విధుల నుంచి తక్షణం తొలగించాలని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ డిమాండ్ చేశారు. హరి టవర్స్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటికి వెళ్లి సహ ఉద్యోగిని వేధించడంపై ఆమె భర్త ఆఫీసుకు వెళ్లి దండించారని తెలిపారు. ఈయన విధులు నిర్వహించిన ప్రతిచోట దోచుకున్నారని మండి పడ్డారు. కూటమి ప్రభుత్వంలో అధికారులుగా ఉండి మహిళ పట్ల సంస్కాంహీనుడుగా నడుచుకోవడం సరికాదన్నారు. రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వివరించామని తెలిపారు. 20 ఏళ్ల నుంచి కోట్లు వెనకేసుకుని సహా ఉద్యోగినిపై అసభ్యంగా ప్రవర్తించిన అధికారిపై సుమోటోగా కేసు ఎందు కు నమోదు చేయలేదని ప్రశ్నించారు. వెంటనే ఫోక్స్ కేసు నమోదు చేసి, ఉద్యోగం నుంచి తొలగించాలన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి సమన్వయంతో కృషి చేద్దాం

- కడప పార్లమెంట్ సభ్యులు వై.ఎస్.అవినాష్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న కడప ఎంపీ అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప

కేంద్ర ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు అందించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు జిల్లా అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని కడప పార్లమెంటు సభ్యులు, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్‌పర్సన్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ హాలులో కలెక్టర్, దిశా మెంబర్ సెక్రెటరీ శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో దిశా చైర్పర్సన్, కడప ఎంపీ అవినాష్ రెడ్డి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కడప నగర మేయర్ సురేష్ బాబు, జడ్‌పి చైర్మన్ శారద, బద్వేల్ ఎమ్మెల్యే దాసరి సుధా, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ముందుగా కడప పార్లమెంటు సభ్యులు అవినాష్ రెడ్డి మాట్లాడుతూ దిశ కమిటీ సమీక్ష సమావేశం జిల్లాలో మొదటిసారిగా నిర్వహించడం సంతోషకరమని అన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వ యంగా పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, రావాల్సిన నిధులు ఏ విధంగా తీసుకురావాలి అనేది ఈ కమిటీ ద్వారా చర్చించడం జరుగుతుందన్నారు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, పంచాయతీరాజ్ సంస్థలు, మున్సిపల్ బాడీ, స్థానిక సంస్థలలో ఎన్నికైన ప్రజా ప్రతినిధులందరి మధ్య మెరుగైన సమన్వయం ఉండేలా జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం డిఆర్ డిఎ, పంచాయతీరాజ్ శాఖ గృహ నిర్మాణం శాఖ, డ్వామా, గ్రామీణ నీటిపారుదల శాఖ, మున్సిపల్ కార్పొరేషన్ తదితర శాఖల వారీగా జరుగుతున్న కార్యక్రమాలపై దిశా చైర్ పర్సన్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో చర్చించిన ప్రతి అంశంపై అధికారులు వెంటనే చర్యలు తీసుకుని పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఉపయోగపడే పనులను సత్వరం పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి దిశా కమిటీ సమావేశం అవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిధుల ద్వారా అమలవుతున్న పథకాలు ఏ విధంగా అమలు అవుతున్నాయి పేర్కొన్నారు. వాటిలో లోపాలు ఉంటే ఏ విధంగా వాటిని పరిష్కరించుకొని ప్రజలకు అందించాలని ఈ కమిటీ ఏర్పాటు అయిందని తెలిపారు. ఈ కమిటీ ద్వారా ప్రజాప్రతినిధులు పలు సలహాలు సూచనలు తీసుకొని కేంద్ర ప్రభుత్వానికి వెల్లడిస్తామన్నారు. ఈ కమిటీ సభ్యులు సమావేశంలో లేవనెత్తిన అంశాలన్నిటిని నోట్ చేసుకున్నామని వాటిపై దృష్టి కేంద్రీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి అధికారులు సమాచారాన్ని ఆయా సర్పంచులకు తెలియజేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు కూడా ఇందుకు సహకరించాలన్నారు. హార్టికల్చర్ డ్రిప్ ఇరిగేషన్ ద్వారా రెండు సంవత్సరాల పెట్టుబడితో దాదాపు 30 సంవత్సరాల పాటు ఆర్థిక స్థిరత్వం, మరింత ఎక్కువ ఆదాయం పొందవచ్చునని తెలిపారు పులివెందులలో అరటి ప్రాసెసింగ్ యూనిట్ జిల్లాలో మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను అభివృద్ధి చేస్తామన్నారు. రైతులకు ఉపాధి పథకంతో అనుసంధానం చేయాలని కొందరు సభ్యులు కోరారు. మరికొందరు మండలాలు, గ్రామాల్లో పంచాయతీ మున్సిపల్ మండల తీర్మానం మేరకు పనులు చేపట్టాలని కోరారు. గ్రామ సభల్లో ప్రతిపాదించిన సిసి రోడ్లు, కాలువ నిర్మాణాలకు సంబంధించి ఎక్కడెక్కడ పనులు చేపట్టిన వివరాలను ప్రజాప్రతినిధులకు అందించాలని కోరారు. అలాగే కొన్ని మండలాల్లో రైతులకు పంట నష్టం వాటిల్లిందని వాటికి నష్టపరిహారం కింద క్రాప్ ఇన్సూరెన్స్ ఇప్పించాలని కోరారు. చెన్నూరులో జాతీయ రహదారి 40 సైడ్ రోడ్లు, అప్రోచ్ రోడ్లు, డ్రైనేజీలు పూర్తికాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అంతకు ముందు సమావేశం ప్రారంభంలో జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో జడ్‌పి సిఇఒ ఓబులమ్మ వివరించారు. ఆకాంక్షిత జిల్లాలో భాగంగా సి.కె. దిన్నె, జమ్మలమడుగు మండలాల్లో మరిన్ని గ్రామల్లో ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద పనుల మంజూరుకు తీర్మాణించారు. జిల్లాలో హార్టికల్చర్ ద్వారా మరింత ఎక్కువ మంది రెట్కతులు లబ్ధి పొందే విధంగా లక్ష్యాన్ని నిర్దేశించాలని తీర్మానించారు. సమావేశంలో దిశా కమిటీ సభ్యులు శివలక్ష్మి శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి, విశ్వనాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్లు, మండల అధ్యక్షులు, జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో మెరుగైన పోలీసింగ్

నూతన ఎస్‌పి ఇ.జి.అశోక్ కుమార్

బాధ్యతలు స్వీకరిస్తున్న ఇ.జి.అశోక్‌కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా నూతన ఎస్‌పిగా ఇ.జి.అశోక్ కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కడప జిల్లాకు ఎస్‌పిగా రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతపురం జిల్లా నార్పల తమ స్వగ్రామమని, తమ తల్లిదండ్రులు సుబ్బయ్య, సావిత్రమ్మకు తాను రుణపడి ఉంటానన్నారు. 2010 లో గ్రూప్ వన్ పరీక్ష ద్వారా డిఎస్‌పిగా ఎంపికైన తర్వాత వివిధ ప్రాంతాలలో విధులు నిర్వహించానని పేర్కొన్నారు. 2014 నుంచి 2017 వరకు దాదాపు 2 సంవత్సరాల 10 నెలల పాటు కడప సబ్-డివిజనల్ పోలీస్ అధికారిగా విధులు నిర్వహించానని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో హోం గార్డు స్థాయి నుంచి ఎస్‌పి వరకూ సమష్టిగా కృషి చేస్తామని చెప్పారు. మహిళలు, చిన్నారులు పట్ల అఘాయిత్యాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. అలాంటి నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదని, కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో ఉన్న ప్రజలు ఎస్‌పి కార్యాలయానికి రావడానికి ఎలాంటి సంకోచానికి గురికా వాల్సిన అవసరం లేదన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహనా కల్పించ డానికి మరింత కృషి చేస్తామన్నారు. రూరల్ పోలీసింగ్‌ను ప్రజలకు మరింత చేరువ చేస్తామన్నారు. మేధావులు, మీడియా, ప్రజల భాగస్వామ్యంతో ఫ్రెండ్లీ పోలీసింగ్ అందిస్తామన్నారు. తప్పు చేసిన వారికి, తప్పు చేయని వారికి మధ్య తేడా ఏమిటో చెప్పేలా పోలీసింగ్ ఉంటుందన్నారు. తనపై నమ్మకంతో కడప జిల్లా ఎస్‌పి గా అవకాశం కల్పించిన సిఎం నారా చంద్రబాబు నాయుడు, డిజిపి సి.హెచ్ ద్వారకా తిరుమల రావుకు కృతజ్ఞతలు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞా నాన్ని పోలిసింగ్‌కు అనుసంధానం చేయడమనే ఆలోచనను జిల్లాలో అమలుచేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, అదనపు ఎస్‌పి (ఏ.ఆర్) బి.రమణయ్య ఉన్నారు.

పోలీసు ప్రతిష్ట పెంపొందించేలా విధులు నిర్వర్తించాలి

జిల్లా పోలీస్ శాఖ ప్రతిష్ట పెంపొ ందించేలా విధులు నిర్వర్తించాలని ఎస్‌పి అశోక్ కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లాలోని డిఎస్‌పిలు, సిఐలు, నగరంలోని ఎస్ఐలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం)కు వచ్చే ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే పిటిషనర్లతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఓ వైపు ప్రజలకు చేరువయ్యేలా ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూ మరోవైపు అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవవహరించాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి పరిష్కరించాలని పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో సబ్-డివిజన్‌ల వారీగా సమీక్ష నిర్వహించి కేసుల పురోగతిని పరిశీలిస్తామన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, అదనపు ఎస్.పి బి.రమణయ్య, జిల్లాలోని డిఎస్‌పిలు, సిఐలు,ఎస్ఐలు ఉన్నారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్‌పి

కడప : వైఎస్ఆర్ జిల్లా నూతన ఎస్‌పిగా శుక్రవారం ఇ.జి. అశోక్ కుమార్ బాధితులు స్వీకరించారు. అనంతరం ఎస్‌పిఅశోక్ కుమార్ కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

నూతన ఎస్‌పిని కలిసిన నాయకులు

ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన ఇ.జి.అశోక్ కుమార్‌ని జన వికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎండి తాహిర్, కన్వీనర్, టిడిపి నగర ఉపాధ్యక్షుడు పి.మన్సూర్ ఖాన్ శుక్రవారం కలసి పూల మొక్కను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. జన వికాస్ సేవా సమితి చేస్తున్న సేవలు గురించి వివరించారు. అశోక్ కుమార్ డిఎస్‌పిగా ఉన్నప్పుడు జన వికాస్ సేవా సమితి చేస్తున్న సేవలలో పాల్గొనే వారన్నారు. మత సమరస్యానికి ప్రతిక మన కడప అని, ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, వాహనాలు వేగంగా నడపడం వల్ల ప్రమాదాలు జరుగు తున్నాయని చెప్పారు. తప్పకుండా జన వికాస్ నిర్వహించే కార్యక్రమాలలో పాల్గొనేందుకు ప్రయత్నిస్తాను అన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు డాక్టర్ శ్రీనివాసులు, జావిద్, అమీన్, అబ్దుల్ వాజిద్, శివ పాల్గొన్నారు.

ముస్తాబైన ఎసిఎ స్టేడియం

నేటి నుంచి క్రికెట్ స్టేట్ మ్యాచ్ ప్రారంభం

- అన్ని హంగులతో ముస్తాబైన స్టేడియం
- తొలి మ్యాచ్‌లో తలపడనున్న ఆంధ్ర, పంజాబ్ జట్లు

ప్రజాశక్తి - కడప

కడప లోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ఈనెల 25 నుంచి సికె నాయుడు ట్రోఫీ క్రికెట్ స్టేట్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. మ్యాచ్‌కు సంబంధించి వైఎస్ రాజారెడ్డి స్టేడియం అన్ని హంగులతో ముస్తాబైంది. ప్రారంభ మ్యాచ్ ఈనెల 25 నుండి 28 వరకు ఆంధ్ర, పంజాబ్ జట్ల మధ్య జరగనుంది. అన్ని ఏర్పాట్లను జిల్లా క్రికెట్ అసోసియేషన్ సిద్ధం చేసింది. ఇరుజట్ల క్రీడాకారులకు, అంపైర్లకు, మ్యాచ్ అఫీషియల్స్‌కు అన్ని భోజన వసతి సౌకర్యాలను జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఏర్పాటు చేసింది. మ్యాచ్ సజావుగా జరిగేందుకు మైదానాన్ని సిద్ధం చేశారు. ఇరుజట్ల క్రీడాకారులకు బౌలింగ్, బ్యాటింగ్‌కు అనుగుణంగా మైదానాన్ని, పిచ్‌ను పిచ్ క్యూరేటర్ బాలరాజు రెడీ చేశారు. ఏర్పాట్లు అన్నింటిని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. భరత్ రెడ్డి కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్ పరిశీలించారు. కాగా రెండవ మ్యాచ్ ఫిబ్రవరి నెల 1 నుండి 4 వరకు ఆంధ్ర, హిమాచల్ ప్రదేశ్ జట్ల మధ్య జరుగనుంది. ఆంధ్ర పంజాబ్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లను తిలకించేందుకు అందరూ ఆహ్వానితులేనని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈ సందర్భంగా తెలిపారు.

లాటరీ పద్ధతిలో మద్యం షాపులు ఎంపిక

ప్రజాశక్తి - కడప

జిల్లాలో గీత కులాలకు సంబంధించి 14 మద్యం షాపులకు లాటరీ పద్ధతిలో ఎంపిక చేశామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గీత కులాలకు లాటరీ పద్ధతిలో మద్యం షాపులు ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా తొలుత కలెక్టర్ లాటరీ ప్రక్రియను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-2026 సంవత్సరానికి సంబంధించి మద్యం షాపులకు గీత కులాల ఎంపికకు లాటరీ ద్వారా పారదర్శక కేటాయింపు ప్రక్రియను ప్రారంభించామని చెప్పారు. జిల్లాలో గీత కులాలకు సంబంధించి ఈడీగ, గౌడ్, గౌండ్ల, గౌడ నాలుగు కులాలకు మద్యం షాపుల కేటాయించామన్నారు. ఇందులో మైదుకూరు మున్సిపాలిటీకి ఈడీగ, వేముల మండలానికి గౌడ్, వల్లూరు మండలానికి ఈడీగ, పెద్దముడియం మండలానికి గౌడ్, పులివెందుల మున్సిపాలిటీకి గౌడ్, ఎస్.ఎ. కాశీనాయన మండలానికి ఈడీగ, ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి ఈడీగ, బద్వేలు మున్సిపాలిటీకి ఈడీగ, ప్రొద్దుటూరు రూరల్‌కు ఈడీగ , ఖాజీపేట మండలానికి గౌడ్, చక్రాయపేట మండలానికి ఈడీగ , కడప మున్సిపాలిటీకి ఈడీగ, వి.ఎన్. పల్లి మండలానికి గౌండ్ల, చింతకొమ్మదిన్నె మండలానికి గౌడకు కేటాయించామని చెప్పారు. ఈ లాటరీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించామని చెప్పారు. జిల్లా ప్రోబిహిబిషన్, ఎక్సైజ్ అధికారి గజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఫిబ్రవరి 5 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల నమోదు, సమర్పణ ఉంటుందని అన్నారు. ఫిబ్రవరి 6న దరఖాస్తుల పరిశీలన లాటరీకి సంబంధించిన సన్నాహాలు జరుగుతాయన్నారు. ఫిబ్రవరి 7న కలెక్టర్ సమక్షంలో లాటరీ ప్రక్రియ ద్వారా షాపుల కేటాయింపు జరుగుతుందని ఎంపికైన దరఖాస్తుదారులకు సమాచారం అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవి కుమార్, సి.ఐ. కృష్ణ కుమార్, జిల్లా బి.సి. సంక్షేమ శాఖ అధికారి భారత్ కుమార్ రెడ్డి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

కడప 'ఉక్కు' కోసం ఈశ్వర్‌రెడ్డి స్ఫూర్తితో పోరాడాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప ఉక్కు కోసం జిల్లా ప్రజా ప్రతినిధులు మాజీ ఎంపీ ఈశ్వర్ రెడ్డి స్ఫూర్తితో పోరాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో రాష్ట్ర 27వ మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర 27 మహాసభల సందర్భంగా కడప జిల్లాలో సిపిఎం జిల్లా కమిటీ ఈనెల 30, 31 తేదీలలో 'కడప ఉక్కు- ఆంధ్రుల హక్కు' నినాదంతో జీపు జాతా నిర్వహిస్తున్నామని తెలిపారు. కడప ఉక్కుఫ్యాక్టరీని 'శిలాఫలకాల ఫ్యాక్టరీ'గా మార్చిన ఘనత టిడిపి, వైసిపి దేనని ఎద్దేవ చేశారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు మాజీ జిల్లా ఎం.పి. పెద్ద పసుపుల ఈశ్వర్ రెడ్డి విశాఖ ఉక్కు కోసం మన పదవికి రాజీనామా చేశారని పేర్కొన్నారు. వారి స్ఫూర్తితో కడప జిల్లాలోని ప్రజాప్రతినిధులు కడప ఉక్కు కోసం జిల్లా ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. బిజెపి తనను బలపరిచే వారిని, సైతం భయపెట్టి బెదిరించి లొంగ తీసుకుంటుందని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.రామ్మోహన్, వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు పి.దస్తగిరి రెడ్డి, బ్రహ్మంగారిమఠం మండల కార్యదర్శి జి.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

జీపు జాతాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఈనెల 30, 31వ తేదీలలో 'కడప ఉక్కు- ఆంధ్రుల హక్కు' నినాదంతో జీపు జతా నిర్వహిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యవర్గ కమిటీ సభ్యులు బెల్లం మనోహర్ తెలిపారు. జమ్మలమడుగు పట్టణంలో ఎన్‌జిఒ కార్యాలయంలో మాట్లాడుతూ ఆయన సిపిఎం రాష్ట్ర 27వ మహాసభల సందర్భంగా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా జీపు జాతాను చేయాలన్నారు. విభజన హామీలలో భాగమైన కడప ఉక్కు పై ఇన్ని సంవత్సరాలుగా ఎందుకు నిర్మించలేదనీ ప్రశ్నించారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో చదువుకున్న యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించక గల్ఫ్ లాంటి దేశాలకు వలసలు పోతున్నారన్నారు. కరువుతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంతంలో ఉపాధి పరిశ్రమలు చాలా అవసరం అన్నారు. కడప జిల్లాలోని ప్రజాప్రతినిధులు కడప ఉక్కు కోసం జిల్లా ప్రజలు పోరాడాలని కోరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి జి.ఏసుదాస్ పట్టణ కమిటీ సభ్యులు ఏ. వినయ్ కుమార్ పాల్గొన్నారు. **అట్లూరు :** సిపిఎం 27 వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం అట్లూరు మండల కార్యదర్శి ఈ రమణయ్య పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు స్వప్న , గంగయ్య ,రాజు, లక్ష్మీదేవి, నాగరాజు, రామకృష్ణ ,శివ, శంకరయ్య, గోపాల్ పాల్గొన్నారు

ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌కు అభినందన

ప్రజాశక్తి - కడప

మైసూర్ విశ్వవిద్యాలయంలో ఈనెల 16 నుంచి 22 వరకు నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో ఆర్ట్స్ కళాశాల విద్యార్థి ఎం. అశోక్ యోగివేమన యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్. విభాగం తరపున పాల్గొని, అక్కడ జరిగిన విభిన్న కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడం గర్వకారణం అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ హర్షం వ్యక్తం చేశారు. అశోక్‌ను అభినందించి సర్టిఫికెట్లను ప్రిన్సిపల్ అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఉర్దూ మీడియం పాఠశాలలను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - కడప : త్వరలో చేపట్టబోయే ఉపాధ్యాయ రేషనలైజేషన్ ప్రక్రియలో మైనర్ మీడియా, రాష్ట్ర అధికార రెండవ భాషగా ఉర్దూను దృష్టిలో ఉంచి పల్లెలో నివసించే రాష్ట్ర మైనార్టీ పిల్లలకు, ఉర్దూ మీడియం పాఠశాలలను బలోపేతం చేయాలని కోరుతూ శుక్రవారం కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (ఎపియూటిఎ) ప్రతినిధి బృందం వినతి పత్రం సమర్పించారు. తొలుత ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ముద్రించిన కెలెండర్లు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి. మహబూబ్ ఖాన్, కార్యదర్శి జి. హిదయ తుల్లాఖాన్, కోశాధికారి భాషా ఖాద్రి, జిలాన్ బాష, అబ్దుల్ బాసిత్, ఎస్ఎండి. ఫయాజ్ బాష, ముబారక్ అలీ, అన్సర్ బాష పాల్గొన్నారు.

కొమ్ముకాసే అధికారులపై చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో వైసిపి నాయకులకు కొమ్ముకాస్తున్న కార్పొరేషన్ అధికారులపై చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి హెచ్చరించారు. శుక్రవారం ద్వారకా నగర్ లోని ఆమె నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కడప అభివృద్ధిపై పలు శాఖల అధికారులతో సమీక్ష చేశామని తెలిపారు. రూ.8 కోట్లతో బుగ్గవంక సుందరీకరణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అడ్డంకిగా తయారైన విద్యుత్ స్తంభాలు ట్రాన్స్‌ఫార్మర్లు తొలగింపు పై అధికారులతో సమీక్షించామని పేర్కొన్నారు. ఆరేళ్లుగా నిరుపయోగంగా ఉన్న టిడ్కో ఇళ్ళకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి లబ్ధి దారులకు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. నీటి సరఫరా, రోడ్డు, కాలువల నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. కడప నగరం చిన్నది, జనాభా అధికం, నగరంలో చెత్తా చెదారం పెరిగి పోతోందని పేర్కొన్నారు. పారిశుధ్యం పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పారు. గత పాలకులతో కుమ్మక్కై కొందరు అధికారులు ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారు. అనుమతి లేని లే అవుట్లు పై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు కూడా అనుమతి లేని లే అవుట్లు లో ప్లాట్లు కొనవద్దు, నష్ట పోవద్దని హితవు పలికారు. నెల రోజుల్లో పన్ను మినహాయింపు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. రెండు నెలల కొకసారి నగర అభివృద్ధిపై సమీక్ష చేమని పేర్కొన్నారు. వచ్చే సమీక్ష నాటికి నేటి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై పురోగతిని పరిశీలిస్తామని తెలిపారు.

పాలకులకు పట్టని చేనేత కార్మికుల కష్టాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

పాలకులకు చేనేత కష్టాలు కనపడటం లేదని, ప్రభుత్వాలు మారుతున్న చేనేతల తలరాతలు ఎక్కడా మారడం లేదని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరణాల.శివ నారాయణ, ఓబులేసు తెలిపారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్లోని చేనేత జౌళి శాఖ కార్యాలయంలో పరిపాలనా అధికారి అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయం తరువాత చేనేత ప్రధాన వృత్తిగా ప్రసిద్ధి చెందిన చేనేత పరిశ్రమ కార్పోరేట్ విధానాల వలన సంక్షోభంలో చిక్కుకుందని పేర్కొన్నారు. తత్ఫలితంగా చేనేత కార్మికులు ఆకలి చావులు, ఆత్మహత్యలకు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి. ప్రభుత్వం చేనేతపై జిఎస్‌టి. వేయటంతో చేనేత రంగం మరింత సంక్షోభంలోకి నెట్టబడిందని తెలిపారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం షెడ్‌కార్మికులకు, సహకార సంఘాలతో నేత నేస్తున్న చేనేత కార్మికులకు అమలు చేయలేదని చెప్పారు. బడ్జెట్‌తో చేనేతకు కేటాయింపులు కూడా చేయలేదని పేర్కొన్నారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్‌లు ఖచ్చితంగా అమలు చేయాలని కోరారు. చేనేత కార్మికులకు వెల్ఫేర్ ఫండ్ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు .సహకార సంఘాల అప్పులు రద్దు చేయాలి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పల్లా లక్ష్మి నారాయణ, సహాయ కార్యదర్శి కొండయ్య, జిల్లా కమిటీ సభ్యులు బడిగించాల.నారాయణ, చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి బాలసుబ్బయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం శుక్రవారం విజయవాడలో నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షులుగా చిన్న బాబు వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఏ.వి.నాగేశ్వరావు హాజరయ్యారు. సమావేశంలో ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పి.వెంకటసుబ్బయ్యను ఎన్నుకున్నారు.

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప

పిల్లల ఆరోగ్య విషయాల పట్ల ఎప్పటికప్పుడూ తగు జాగ్రత్తలు వహించాలని అధికారులను సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రెటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఆదేశించారు. శుక్రవారం కడప నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహాలను జడ్జి సందర్శించారు. పిల్లలు ఏయే తరగతులను అభ్యసిస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను, వంటశాలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవల పథకం 2024 వివరించారు. విద్య విలువైన క్రమశిక్షణతో అభ్యసించాలి అని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, పిల్లల విద్యా ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహం సూపరింటెండెంట్ వీరయ్య, వైద్యాధికారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఊరట

ప్రజాశక్తి - కడప అర్బన్

సిపిఎస్ ఉద్యోగులు తమ కాంట్రిబ్యూషన్ నుంచి అవసరాల కోసం పొందే ఉపసంహరణపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. శుక్రవారం ఉప ఖజానా శాఖాధికారి ఎస్. వెంకటేశ్వర్లను ఆయన ఛాంబర్ లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ సిపిఎస్ ఉద్యోగులు తమ జీతం నుంచి కాంట్రిబ్యూషన్ గా చెల్లించిన సొమ్ములో 25 శాతం వివాహ, అనారోగ్య అవసరాల కోసం ఉపయోగించుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆ సొమ్మును పొందడానికి ప్రస్తుతం ఖజానా శాఖ నిషేధం విధించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చాలామంది సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆర్థిక అవసరాల కోసం రుణాల ద్వారా తీసుకోవాలనుకున్న సొమ్మును విడుదల చేయకుండా నిషేధించడం సమంజసం కాదన్నారు. వెంటనే పాక్షిక ఉపసంహరణపై ఉన్న నిషేధాన్ని ఎత్తి వేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతాల నుంచి చెల్లింపులు జరిగిన కాంట్రిబ్యూషన్ ఇవ్వడానికి కూడా ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారో తెలియడం లేదని వెంటనే చెల్లింపులు జరిగే లాగున చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపఖజానా శాఖాధికారి వెంకటేశ్వర్లు వెంటనే రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్య పరిష్కారం కోసం కృషి చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర అధికారుల సూచన మేరకు పాక్షిక ఉపసంహరణపై ఉన్న నిషేధాన్ని తొలగిస్తున్నట్లు తెలిపారు. సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల పాక్షిక ఉపసంహరణ కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తల చంద్రశేఖర్, గాజులపల్లి గోపీనాథ్, సురేష్ బాబు, వై.రామకేశవ పాల్గొన్నారు.

తల్లికి వందనం వెంటనే అమలు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన తల్లికి వందనం పథకాన్ని వెంటనే అమలు చేయాలని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ .15 వేలు ఇస్తామని టిడిపి కూటమి ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో 83 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. అందులో దాదాపు సగం మంది బాలికలు ఉన్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు పథకం అమలు కాలేదని తెలిపారు. బాలికల పట్ల సమాజం వివక్ష చూపడం దురదృష్టకరమని చెప్పారు పేద కుటుంబాలలోని బాలికలకు పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ, విద్యను ప్రోత్సహించడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులను ప్రోత్సహించడం, ఆడ శిశువుల భ్రూణ హత్యలను అరికట్టడం ఇలా బహుముఖ ప్రయోజనాలతో బంగారు తల్లి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు. ఇటువంటి మంచి పథకాన్ని టిడిపి, వైసిపి ప్రభుత్వాలు రద్దు చేయడం శోచనీయం అన్నారు. పథకాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

తులసిరెడ్డిని కలిసిన కమలాపురం కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో ఉన్న పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డిని కమలాపురం కాంగ్రెస్ నేతలు కలిశారు. శుక్రవారం కమలాపురం నియోజక వర్గ కాంగ్రెస్ సమన్వయ కర్త మీగడ అశోక్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి కమలాపురం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిపై తీసుకోవాల్సిన వాటిపై రాజకీయ చర్చలు జరిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రతి గ్రామంలో కనిపిస్తాయని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అలాగే కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి, టిడిపి ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పాలని తెలిపారు.ముఖ్య మంత్రి చంద్రబాబు చేపట్టిన దావోస్ పర్యటన పూర్తిగా నిరాశ పరిచిందని తులసిరెడ్డి పేర్కొన్నారు. పర్యటన ఖర్చు రూ . 80 కోట్లు కాగా రూ.80 ఒప్పందాలు కూడా జరగలేదని విమర్శించారు. అదే సమయంలో మహా రాష్ట్ర ప్రభుత్వంతో రూ 16 లక్షల కోట్ల ఒప్పందాలు, తెలంగాణా ప్రభుత్వంతో రూ 1.78లక్షల కోట్ల ఒప్పందాలు జరగడం గమనార్హం అన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

నిబంధనలు ఉల్లఘించి వ్యవహరిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రయివేట్ టీచర్స్ లెక్చరర్స్ సంఘ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్రంలోని కార్పొరేట్ కళాశాలలు నారాయణ, శ్రీచైతన్య విద్యా సంస్థలలోని విద్యార్థుల మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పేర్కొన్నారు. గురువారం అనంతపురం నగర శివారులోని నారాయణ రెసిడెన్సియల్ జూనియర్ కళాశాలలో చరణ్ అనే విద్యార్థి కళాశాల మూడో అంతస్తు నుంచి దూకి అత్యంత దారుణంగా మృతి చెందాడన్నారు. ఒత్తిడితో చదువులు చదవలేక, తోటి విద్యార్థులతో చెప్పుకోలేక కార్పొరేట్ విద్యాసంస్థల ధనదాహానికి తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడుతుండడం బాధాకరమన్నారు.

ప్రభుత్వ మద్దతు ధరకు కందులు విక్రయం

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతులు సాగు చేసిన కందులను ప్రభుత్వానికి మద్దతు ధరకు విక్రయించేందుకు రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. పెద్దదుద్యాల గ్రామంలో సాగు చేసిన నువ్వుల పంటను శుక్రవారం ఎఒ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నువ్వు పంటలో సస్య రక్షణ చర్యలు పాటించాలన్నారు. రసం పీల్చే పురుగుల ఉధృతి నివారణకు వేప నూనె 5 ఎమ్ఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఖరీఫ్‌లో కంది పంట సాగు చేసిన ప్రతి రైతూ ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

కాలువలో పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కాలువలో పడి వృద్ధుడు మృతి చెందాడు. శుక్రవారం పట్టణ పరిధిలోని రాణి తోపు సమీపంలోని నీటి కాలువలో పడి పకీరప్ప (70) అనే వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు.. లింగాల మండలం మురారి చింతల గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. కొన్ని రోజుల కిందట కనపడట్లేదని లింగాల పోలీస్ స్టేషన్ లో వృద్ధుడు బంధువులు ఫిర్యాదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈనేపథ్యంలో శుక్రవారం కాలువలో మృతచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పట్టణంలోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఐదుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - ముద్దనూరు

చిన్నకత్తెర పల్లె గ్రామంలో శుక్రవారం చెట్లలో మంగతాయి జూదం ఆడుతున్న ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎర్రగుంట్ల మండలం వై. కోడూరు గ్రామానికి చెందిన బండి శివ శంకర్ రెడ్డి మరో నలుగురు వ్యక్తులు జూదం ఆడుతున్నారని విషయం తెలుసుకుని దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. వారి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.1.16,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

ఆడపిల్లలు చదివితే ఉజ్వల భవిష్యత్తు

- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కస్తూర్బా బాలికలతో కలెక్టర్, జెసి

ప్రజాశక్తి - కడప

ఆడపిల్లలు చదువుకుంటే అన్ని రంగాలలో కూడా ముందంజలో ఉంటారని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. శుక్రవారం మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ డి. శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం కలెక్టరేట్‌లోని సభా భవనంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ అతిదిసింగ్, రీజినల్ జాయింట్ డైరెక్టర్ మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రోహిణి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలకు విద్య ప్రాధాన్యత ఎక్కువగా ఉందన్నారు. చదువుకుంటే అన్ని రంగాలలో కూడా ముందంజలో ఉంటారు అని తెలిపారు. పురుషులకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రతి రంగంలో కూడా ఉన్నత స్థానంలో చాలామంది ఉన్నారు అన్నారు. మనోధైర్యం ఉంటే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు అని అన్నారు. ఉదాహరణకు సునీత విలియమ్స్ అంతరిక్షంలో కూడా రాణిస్తున్నారు, ఎన్నో ఇబ్బందులు ఉన్నా కూడా ధైర్యంతో అన్ని అవకాశాలు అందిపుచ్చుకొని ధైర్యంగా ఆత్మస్థైర్యంతో అంతరిక్షంలోకి వెళ్లారని పేర్కొన్నారు. పురుషుల కన్నా స్త్రీలు ఎక్కువగా విద్యలో ముందంజలో ఉన్నారు, ఆత్మ రక్షణకై కరాటే లాంటి విద్యలు కూడా నేర్చుకోవాలని తెలియజేశారు. ఆడపిల్లలను రక్షించాలి, ఆడపిల్లలను చదివించాలి, లింగ వివక్షత చూపకూడదని, ప్రతి ఆడపిల్లకు సమాన హక్కు, బాలిక సాధికారత వంటి విషయాలు తెలియజేశారు. జాయింట్ కలెక్టర్ శ్రీమతి అతిధి సింగ్ మాట్లాడుతూ బాలికల విద్య ఆరోగ్యం రక్షణ వంటి వాటిపై శ్రద్ధ వహించాలని, బాలికలు ఆత్మస్థైర్యంతో మెలగాలని అన్నారు. ఆడపిల్లలు చదువుకున్నప్పుడే ధైర్యం వస్తుందని, ఇలాంటి కార్యక్రమాలలో బాలురులను కూడా భాగస్వాములను చేయడం వల్ల బాలికల ఔన్నత్యం తెలుస్తుందని తెలియజేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ రోహిణి మేడం మాట్లాడుతూ ఆడపిల్ల ఇంకను ఒంటరిగా బయటకు ధైర్యంగా బయటకు వెళ్లలేని పరిస్థితి ఇప్పటికీ ఉందని, ఆడపిల్లల పట్ల తల్లిదండ్రులు వారికి ధైర్యం చెబుతూ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారత అధికారి డి. శ్రీ లక్ష్మీ మాట్లాడుతూ మన మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ప్రమాణ స్వీకారం చేసిన రోజును జాతీయ బాలిక దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని చెప్పారు. **కడప అర్బన్ :** భ్రూణహత్యల నుంచి ఆడ శిశువుకు రక్షణ కల్పించి వారిని పుట్టనిచ్చి ప్రశాంత వాతావరణం లో పెరగనించి వారికి మంచి విద్యా సౌకర్యాలు కల్పించవలసిన బాధ్యత ప్రతి పౌరుడు పైన ఉన్నదని అది సమాజానికి ఎంతో అవసరం అని బారత స్కౌట్స్ అండ్ గైడ్ కార్యదర్శి డి.ప్రమీల తెలిపారు. కడప నగరంలోని స్కౌట్ ప్రాంగణంలో జాతీయ బాలిక దినోత్సవ వేడుకలను స్కౌట్స్ అండ్ గైడ్స్, జన విజ్ఞాన వేదిక, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక, యుటిఎఫ్ రాష్ట్ర నాయకురాలు రూత్ ఆరోగ్యమేరీ, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజాత రాణి, జె. వి. వి సమతా కమిటి ఆరుణ,గైడ్ కెప్టెన్ మంజులవాణి, ఝాన్సీ పాల్గొన్నారు. **గోపవరం :** బద్వేల్ మండలంలోని బాలిక ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె వినయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హెల్త్ ఎడ్యుకేటర్ బి వెంగయ్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, ఎఎన్ఎం వై. చెన్నమ్మ ,ఆశ, నిత, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. **తొండూరు :** డాక్టర్ ఆరిపుల్లా ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ర్యాలీ , అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మా, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి విజయ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, సూపర్‌వైజర్ శశికళ,ఆరోగ్య సిబ్బంది గ్రామ మహిళలు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, చేయించుకోవడం నేరం అని డాక్టర్లు సాయి చరిత రెడ్డి, గణేష్ రెడ్డి తెలిపారు. మండలంలోని చెలమకూరు గ్రామంలో జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా జడ్‌పిహెచ్ పాఠశాలలో విద్యార్థినులకు లింగ వివక్ష పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారి నాగమునిరెడ్డి హెల్త్ సూపర్‌వైజర్ సుభద్ర, పుల్లమ్మ, సర్పంచ్ లక్ష్మిదేవి , అంగన్వాడీ కార్యకర్తలు,టీచర్స్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు **చక్రాయపేట :** ప్రతి ఒక్కరూ బాలిక విద్యను ప్రోత్సహించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుభాషిని పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మండలంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాజశేఖర్ రెడ్డి ఎంఇఒ- 2 రవికుమార్, పంచాయతీ సెక్రటరీ విజయ్ కుమార్ నాయక్ , కస్తూరిబా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** లింగ వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమిద్దమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వసంతకుమారి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నిడు వెలగల కస్తూర్బా ఉన్నత పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు అంగన్వాడీకార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **వల్లూరు :** విద్యతోనే మహిళల పురోభివృద్ధి జరుగుతుందని ఆర్‌బిఎస్‌కె నోడల్ అధికారి డాక్టర్ రమేష్ అన్నారు. శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా వల్లూరు కెజిబివి పాఠశాలలో బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల విద్యా ప్రమాణాలు ఎక్కడైతే పెరుగుతాయో ఆయా సమాజాలలో మహిళల హోదా, గౌరవం మెరుగు పడుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో రమణమ్మ, కన్సల్టెంట్ పాలేశ్వరరావు, పిహెచ్‌సి వైద్యాధికారి ఫణీంద్ర, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ లక్ష్మీదేవి, సిహెచ్‌ఒ వేణుగోపాల్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. **వేముల :** మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో డాక్టర్ ఆఫ్రిన్ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ఉపాధ్యాయులు కె. రాజశేఖర్, అరుణ, వారి సిబ్బంది , ఐసిడిఎస్ సూపర్‌వైజర్ , కె హసీనా, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రభావతమ్మ, శాంత, సుభాషిని, లక్ష్మీకళ, గ్రామ మహిళలు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** ఆహారం,వ్యాయామమే ఆరోగ్యానికి రక్ష అని వైద్యులు తెలిపారు. స్థానిక వైవిఎస్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఐఎంఎ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇండియన్‌మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ త్యాగరాజరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాయిప్రసాద్, కోశాధికారి డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ పద్మజ, డాక్టర్ సమిత, ప్రధానోపాధ్యాయులు నాగార్జునరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కాశీప్రసాదరెడ్డి, ఉపాధ్యాయులు గంగాధర్‌నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ముద్దనూరు :** అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు ఉమారాణి, ప్రవీణాకుమారి శుక్రవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. అనంతరం బాలికల హక్కులు,చట్టాల,ఆహారం,ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ చేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా భారతరత్న కర్పూరీ ఠాకూర్ జయంతి

ప్రజాశక్తి - గోపవరం

బద్వేలు పట్టణ అభివృద్ధి సొసైటి కార్యాలయంలో మహనీయుల ఆశయాల సాధన కమిటీ, బద్వేలు పట్టణ అభివృద్ధి సొసైటి సంయుక్త ఆధ్వర్యాన భారతరత్న కర్పూరీ ఠాకూర్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఠాకూర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మహనీయుల ఆశయాల సాధన కమిటీ మరియు జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బద్వేలు గురుమూర్తి మాట్లాడుతూ కర్పూరీ ఠాకూర్ పేద నాయీబ్రాహ్మణ కుటుంబంలో జనవరి 24,1924 లో బీహార్ రాష్ట్రంలోని సమిష్టిపూర్ జిల్లా,ఫితోంజియా గ్రామంలో జన్మించారని చెప్పారు.విద్యార్థిగా ఆలిండియా విద్యార్థి ఫెడరేషన్ లో చురుగ్గా కార్యక్రమాల్లో, స్వాతంత్ర్యం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని జైలుకు వెళ్లారు .సోషలిస్ట్ పార్టీలో 1952 లో బీహార్‌లో ఎన్నికై 1967 లో ఉపముఖ్యమంత్రి ,విద్యాశాఖ మంత్రిగా ఉంటూ పేద పిల్ల చదువు కోసం స్కూల్ ఫీజులను రద్దు చేసి ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్యను ప్రకటించారని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ అభివృద్ధి సొసైటీ అధ్యక్షులు నానబాల వెంకటేశ్వర్లు, ఆవాజ్ కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు ఎస్.ఎ సత్తార్, కె.బి రసూల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్.అన్వర్ బాష, జాతీయ బిసి సంక్షేమ సంఘం నాయకులు వేణుగోపాల్ యాదవ్, బలిజ సంక్షేమ సంఘం నాయకులు వెంగయ్య, రజక సంఘం నాయకులు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

దోమ కాటుకు గురికాకుండా చూసుకోండి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సబ్ యూనిట్ వైద్యాధికారి సిద్దయ్య అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని యరగుడిపల్లె లో ఫ్రైడే - డ్రైడే సందర్భంగా ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి, నిల్వలున్న నీటిలో అబెట్ పిచికారీ చేసి ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. సబ్ - యూనిట్ అధికారి మాట్లాడుతూ దోమ కాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, బోదకాలు, మెదడు వాపువంటిటి వ్యాధులు వస్తాయని లార్వా నిర్మూలన కోసం ఫ్రైడే- డ్రైడేని పాటించాలని, పనికిరాని గుంతలను, లోతట్టు ప్రదేశాలను, వాడని బావులను పూడ్చి నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అరోగ్య కార్యకర్త నాగమణి, ఆశా కార్యకర్తలు రాజమ్మ, నవనీత పాల్గొన్నారు.

కుంభగిరిలో లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి-అట్లూరు

మండల పరిధిలోని కుంభగిరి గ్రామంలో శుక్రవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆంధ్రప్రదేశ్ , ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా జాతీయ కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన 41 లేక దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. లేగ దూడలను పరిశీలించి ఆరోగ్యవంతంగా ఉన్న దూడల యాజ మానులకు బహుమతులను అందజేయడంతోపాటు కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు కూడా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశు సమర్థక శాఖ సహాయసంచారకులు జి. శ్రీనివాసులు రెడ్డి లేగ దూడల పెంపకం లింగ నిర్ధారణ వీర్యం వల్ల లాభాలను వివరించారు. డాక్టర్ శివరాం రెడ్డి మాట్లాడుతూ నేటి లేక దూడలే పాడి పశువు లు కాబట్టి దూడలలో వ్యాధులు రాకుండా నివారణ చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో సిద్ధవటం సహాయ సంచాలకులు పాల్గొన్నారు

వైసిపి ఆర్‌టిఐ విభాగం
నగర అధ్యక్షులుగా పఠాన్ తౌహిద్ ఖాన్

ప్రజాశక్తి -కడప అర్బన్

వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కడప అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఇందులో భాగంగా ఆర్‌టిఐ విభాగం కడప నగర అధ్యక్షునిగా జగన్ వీరాభిమాని, యువ ఆడిటర్ పఠాన్.తౌహిద్ ఖాన్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేస్తున్నాని పేర్కొన్నారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి తన మీద నమ్మకంతో పదవి ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షులు, మాజీ ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా, జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి, కడప ఎంపీ అవినాష్ రెడ్డి, మేయర్ సురేష్ బాబు కి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

వైసిపి నాయకుల వ్యాఖ్యలు సిగ్గుచేటు

ప్రజాశక్తి - గోపవరం : బద్వేల్ భూ కబ్జాల ఆరోపణలతో బద్వేల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాల్ స్వామి అరెస్టు అయ్యి రెండు నెలల తర్వాత బెయిల్ పై విడుదలైన సందర్భంగా అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు అనడం సిగ్గుచేటు అని, బద్వేల్ నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థి బొజ్జ రోశన్న, బద్వేల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంగల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ బద్వేల్ మున్సిపల్ వైస్ చైర్మెన్ గోపాల్ స్వామి పేదల పక్షాన పోరాటం చేసి జైలుకు వెళ్లలేదని దళితుల, నిరుపేదల భూములు కాజేసి అడ్డంగా దొరికిపోయి జైలుకు వెళ్లి ఇప్పుడు నీతి వాక్యాలు చెబుతున్నారని వాపోయారు. అక్రమ కేసులు పెట్టి వేధించే సంస్కృతి తమకు, తమ పార్టీ లేదని చెప్పారు. నిజంగా తాము కక్షా రాజకీయాలు చేయాలనుకుంటే అక్రమ కేసులు పెట్టాలనుకుంటే వైసీపీ నాయకులు ఒక్కరు కూడా బయట తిరిగే వారు కాదని అని హెచ్చరించారు. కార్యక్రమంలో బి.రామచంద్రారెడ్డి, మాజీ ఎంపిపి ప్రతాపరెడ్డి, బిగ్ బాస్, సుబ్బరాయుడు యాదవ్, సింగరయ్య, లాయర్ ప్రసాద్, సింగసాని విజయ్ కుమార్, రమణ యాదవ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

పనులను నాణ్యతగా చేయండి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల : అభివృద్ధి పనులలో భాగంగా జరుగుతున్న పనులను నాణ్యతగా చేయాలని సదరు కాంట్రాక్టర్లను మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి, కమిషనర్ శేషాఫణి చెప్పారు. నగర పంచాయతీ కార్యాలయానికి తాపలు ,ఇతరత్రా పనులను చేస్తున్నారు. శుక్రవారం నాలుగు రోడ్ల కూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన సర్కిల్‌ను కమిషనర్ పరిశీలించారు. అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అడ్డుగా ఉన్న సిసి కెమెరాలు తొలగించి పనులు పూర్తి అయిన తర్వాత బిగించాలని పోలీసులకు పేర్కొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

విద్యా సంస్థల బస్సులను తనిఖీ చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు పట్టణంలోని నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రయివేట్ విద్యాసంస్థల బస్సులను తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు మేరి కుమార్,విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం ప్రొద్దుటూరులో ఆర్‌టిఒ కార్యాలయంలో రవాణా శాఖ అధికారి మురళీధర్‌కు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంలో ప్రయివేటు విద్యా సంస్థల యాజమాన్యాల బస్సులు ఇష్టానుసారంగా నడుస్తూ విద్యార్థుల ప్రాణాలు గాలిలో పెడుతున్నాయన్నారు. పట్టణంలో స్కూల్స్, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, నర్సింగ్, ఫార్మసీ కళాశాలకు చెందిన బస్సులు వందకు పైగానే నడుస్తున్నాయన్నారు.అందులో వేల మంది విద్యార్థులు ప్రయాణాలు సాగిస్తున్నారని అన్నారు. కానీ కొన్ని విద్యా సంస్థల బస్సులు ఫిట్నెస్ లేకుండా నడుస్తున్నాయన్నారు.రిటైర్డ్ అయిన వారితో డ్రైవింగ్ చేయిస్తున్నారన్నారు. మరికొందరు అనుభవంలేని వారితో డ్రైవింగ్ చేయిస్తున్నారన్నారు. గతంలో పట్టణంలో చాలా ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయని వాపోయారు. .పరిమితికి మించి విద్యార్థులతో ప్రయాణాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఒక్కటి పాటించడం లేదన్నారు. కొన్ని విద్యా సంస్థలు 20 నుండి ముప్పై బస్సులు నడుపుతున్నాయని ఎన్ని రిజిస్ట్రేషన్ల ఉన్నాయో, ఎన్ని లేవో అధికారులకే తెలియాలన్నారు. రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి నిభందనలు విరుద్ధంగా నడుస్తున్న ప్రయివేటు విద్యా సంస్థల బస్సుల పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు చిన్న, రమేష్ పాల్గొన్నారు.

వరి పంటకు జింకు లోపం

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

మండలంలోని ఇల్లూరు, చిన్నదండ్లూరు గ్రామలలో వరి పంటను దాదాపు 850 ఎకరాల్లో రైతులు సాగు చేశారని సహాయ సంచాలకులు ఎ.వి. నరసింహారెడ్డి, ఎఒ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం వరి పొలాలను సందర్శించి వారు మాట్లాడుతూ వరి పొలాలు వాతావరణ పరిస్థితులు వల్ల జింకు ధాతు లోపం ఉందని పేర్కొన్నారు. దీని వల్ల పంట ఎదుగుదల తక్కువగా ఉందని అన్నారు. నివారణ కోసం పలు రకాల మందులను కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. వరి నాటిన 30 రోజుల వరకు 2 సెంటీమీటర్ల నీటిని తర్వాత 5 సెంటీమీటర్ల నీటిని పంటలో నిలువ ఉంచుకోవాలని తెలియజేశారు. మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించుకోవాలని అన్నారు. రబీ పంటలైన శనగ, మినుము , నువ్వులు, వరి, పెసర మొదలైన పంటలకు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని అన్నారు. ఇల్లూరు, చిన్నదండ్లూరు గ్రామ రైతులు, గ్రామ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం 5.45 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు పులివెందుల, శిల్పారామంలో కోలా ప్రసాద్ సహకారంతో శ్రీ రాజా కళా నిలయం పులివెందుల వారి చిన్నారులచే జానపద, వెస్టర్న్ మొదలగు నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తామని శిల్పారామ పరిపాలన అధికారి సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత కంటి పరీక్షలకు విశేష స్వందన

ప్రజాశక్తి-కాశినాయన

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ వారి సౌజన్యంతో పుష్పగిరి కంటి ఆసుపత్రి వారిచే నరసాపురంని ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షలకు మంచి స్పందన లభించింది. ఈ పరీక్షలలో కంటి వైద్యాధికారి శరూన్ నిస్సే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 98 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని చెప్పారు. అందులో 40 మందికి శుక్లం, కోయకండ గుర్తించామని పేర్కొన్నారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు అందజేశామన్నారు. ఇందులో శుక్లం, కోయకండ ఆపరేషను కోసం 21 మందిని కడప పుష్పగిరి కంటి ఆస్పత్రికి తీసుకెళ్తున్నామని చెప్పారు. ఇలాంటి శిబిరాలు పేదలకు ఒక వరం లాంటివి అని, ఈ ప్రాంత ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కంటి చూపు విషయంలో ఏ ఒక్కరో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి సిబ్బంది డాక్టర్ వినోద్ కుమార్, క్యాంప్ కో- ఆర్డినేటర్ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఓబుళరెడ్డిపేట గ్రామంలో పశు వైద్యశిబిరాలను సర్పంచ్ పాలగిరి రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాడిరైతులు ఉపాధి హమీ పథకం ద్వారా పచ్చి గడ్డిని పెంచుకోవడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. బోరు వసతి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ వైద్య శిబిరంలో 26 పాడిపశువులకు సాధారణ చికిత్సలు,18 పశువులకు గర్భకోశ చికిత్సలు, 12 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు,410 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ శిబిరంలో చిన్నగురువలూరు పశువైద్యాధికారి డాక్టర్ ఎం. సుదర్శన్ రెడ్డి, సిబ్బంది శివ, సిద్దయ్య, రామ్మోహన్, సోహైల్, దేవ పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తకు ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి - లింగాల

లింగాల మండల కేంద్రంలోని దిగువ లింగాల అంగన్వాడీ కార్యకర్త శ్రీదేవి ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు శుక్రవారం కడప కలెక్టరేట్‌లో జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని అంగన్వాడీ పీడీ శ్రీ లక్ష్మి, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ చేతుల మీదుగా అవార్డును అందుకుఉన్నారు. దీంతో పలువురు అంగన్వాడీ కార్యకర్తలు ఆమెను అభినందించారు.

మహారాజశ్రీ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి : కడప వారి కోర్టులో

O.S.No. 418/2024

సయ్యద్ హుశ్శేన్ సాబ్ ...వాది

Vs

1. వల్లంకొండు వరదరాజ & 5గురు ఇతరులు. ...ప్రతివాది

పై దావాలో 2వ ప్రతివాదికి పత్రికా ముఖముగా సమను

To,

D2. అల్లం శేషయ్య, S/o Late పుల్లయ్య, వయోవృద్ధుడు, సంఘంపేట, H/o పెద్ద బెస్తవీధి, కడప నగరం.

అను మీరు 2వ ప్రతివాదిగానూ, వి.వరదరాజ గారు మొదటి ప్రతివాదిగను మరియు 4 మీద, వాది స్పెసిఫిక్ పర్ఫార్మేన్స్ ఆఫ్ అగ్రిమెంట్ & పర్మనెంట్ ఇంజక్షన్ దావాకు సలుపగా, సదరు దావాలో మీ యొక్క హాజరుకు గాను 19.02.2025వ తేదీకి వాయిదా వున్నది. కావున సదరు 19.02.2025వ తేదీ ఉ.గం.10.30ని॥లకు రాజశ్రీ పై కోర్టు నందు మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై పై దావాలో మీకు ఏమైనా ఆక్షేపణలు/అభ్యంతరాలు వున్న యెడల కోర్టువారికి తెలుపుకోనంతట, పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.

తేది: 25/01/2025

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

ఎమ్.సుధాకర్ బాబ్జీ

వకీలు, కడప నగరం.

మహారాజశ్రీ నరసరావుపేట 13వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో..

MVOP 41/2023

(1) వజ్రాల వీరమ్మ, (2) వజ్రాల శ్రీనివాసరెడ్డి, (3) భవనం రమాదేవి ......పిటిషనర్లు

AND

(1) షేక్ మాబువలి, (2) నూకనబోయిన వంశీ నందకిషోర్ యాదవ్, (3) నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, రిప్రజంట్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, గుంటూరు. ..... రెస్పాండెంట్లు

To,

R1. షేక్ మాబు వలి S/o మాబు సాహెబ్, D.No: 6/668, డ్రైవర్ వెహికల్ నెం. AP 04 AK 0639, R/o శంకరపురం గ్రామం, శంకరపురం మండలం, కడప జిల్లా.

పై నెంబరు MVOP 41/2023 దావాలో మీకు ఎన్ని పర్యాయములు కోర్టు ద్వారా నోటీసులు పంపినను మీరు తీసుకోనందున ఈ పేపర్ నోటీసు ద్వారా పై కోర్టు వారు ఎదుట ది.5-02-2025 వ తేదీన ఉదయం 10:30 ని.లకు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా ది.5-02-2025. **ఇట్లు.**

శ్రీ జీ.వి.సుబ్రహ్మణ్యం,
శ్రీ ఎస్.సుధాకర్ రెడ్డి,
పిటిషనర్ల తరపు న్యాయవాదులు,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE COURT, KADAPA

O.S.No. 732/2024

Smt. Bakka Achamma, W/o Late Bakka Chinna Anjaneyulu, 64 years, Hindu, H.No.16/653, DC Road, Masapet, Kadapa Dist. **...Plaintiff**

Vs

S. Bharathi, W/o S.Ravi Chandra, Hindu, aged about not known, House wife, H.No.1/211, Chinnachowk Panchayat, Prakash Nagar Colony, Kadapa Dist. **...Defendant**

SUMMONS TO DEFENDANT

పై Suitలో Plaintiff అయినటువంటి Smt. Bakka Acchamma Defendant అయినటువంటి S.Bharathi అయిన మీ పైన దావా వేసివున్నారు. కావున పై తెలిపిన Principal Junior Civil Judge Court, Kadapa నందు మీ హాజరు నిమిత్తమై 10.02.2025వ తేది ఉదయం 10.00 గంటలకు పైన తెలిపిన కోర్టు నందు హాజరుకై రాజ శ్రీ కోర్టు వారు ఉత్తర్వు ఇచ్చి వున్నారు. కావున మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల మీరు స్వయముగా గానీ మీ వకీలు ద్వారా గాని హాజరై తెలుపుకొనవలసినదిగా కోరడమైనది. లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

DASARI ARUNA KUMARI
MBA., LLB.,
N. CHANDRA SEKHAR
MBA., LLB.,
Advocates for Plaintiff

మహారాజశ్రీ గౌరవనీయులైన 1వ అదనపు జిల్లా జడ్జ్ కోర్ట్, కడప

G.O.P. 65/2024

Shaik Nazira, W/o. Late Shaik Azhar Ali, Muslim, age 50 Years, working as Teacher in Nagarjuna Model School, Kadapa, resident of D.No. 7/486, Mochampeta, Kadapa, presently residing at D.No. 8/202-2-6 Upstairs, Bismillah Nagar, Near Al Farhan Islamic School, Kadapa City – 516001, Mob: 9381584188. **...Petitioner**

Vs

Nil. **...Respondent**

జనరల్ నోటీస్

ఇందుమూలంగా తెలియజేయడమేమనగా, పై కేసులో పిటిషనర్ తన మైనర్ కూతురు అయిన షేక్ అమీనా, వయసు 12 సంవత్సరములు తరపున, క్రింద షెడ్యూలు ఆస్తిలో మైనరు వాటాను అమ్ముటకు కోర్ట్ వారి అనుమతి కొరకు దాఖలు చేసి ఉన్నారు. ఇందుకు ఎవరికైనా ఆక్షేపనలు ఉన్న యెడల 21.02.2025వ తేదీన కోర్ట్ వారి ముందు హాజరయ్యి, తెలుపుకోవలయును, లేనియెడల ఆక్షేపణలు లేవని భావించి, గౌరవనీయులైన కోర్ట్ వారు తదుపరి చర్యలు తీసుకొనబడును.

షెడ్యూలు

కడప జిల్లా, కడప సబ్-జిల్లా, కడప నగరం, 16వ వార్డ్, గౌస్ నగర్, ఇంటి నెంబరు 16/374- 15-1, విస్తీర్ణం Ac. 0.01 1/2 సెంటు, తూర్పు - పడమర ఇరువైపుల 20 1/2 లింకులు, ఉత్తరం, దక్షిణం తూర్పు వైపున 74 లింకులు, పడమర వైపున 73 లింకులు, మొత్తం విస్తీర్ణం 72.93 చదరపు గజాలు.

//By Order of the Court//

కె. విజయ్ క్రిష్ణ, B.A.,LL.B.,

పిటిషనర్ తరపున న్యాయవాది,

సెల్: 9959887870..